సాక్షి తిరుపతి

బుధవారం । 3 । సెప్టెంబర్ । 2025



కలుషిత నీటితో కలకలం

రేణిగుంట మండలం గుత్తి వారిపల్లెలో 25 మంది డయేరియా బారీన పడ్డారు. కలుషిత నీటి వల్లే సోకిందని చెబుతున్నారు. - 8లో



పొదుపు సంఘాలకు రుణాలు

పొదుపు సంఘాల సభ్యులకు రుణాలు అందజేస్తామని సెర్ప్ సీఈఓ వాకాటి కరుణ వెల్లడించారు. - 8లో



'తెల్ల'బోయే దోపిడీ

సైదాపురం మండలంలో అక్రమ మైనింగ్ ఆగినట్లే ఆగి..మళ్లీ యథేచ్ఛగా సాగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. - 8లో

న్యూస్‌రీల్

నేటితో ముగియనున్న డిగ్రీ ప్రవేశాల రిజిస్ట్రేషన్

తిరుపతి సిటీ : జిల్లాలో డిగ్రీ కోర్సులలో ప్రవేశాల దరఖాస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియకు బుధవారంతో ముగియనుంది. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే రెండు పర్యాయాలు రిజిస్ట్రేషన్ గడువును పొడిగించిన ఉన్నత విద్యా మండలి బుధవారం రిజిస్ట్రేషన్‌కు తుది గడువును విధిస్తూ 5వ తేదీన వెబ్ ఆప్షన్ల మార్పులు చేర్పులకు అవకాశం కల్పించింది. 8వ తేదీన సీట్ల కేటాయింపు ఉంటుందని, ఉన్నత విద్యా మండలి రివైజ్డ్ షెడ్యూల్ విడుదల చేసింది. 9వ తేదీ నుంచి డిగ్రీ ప్రభుత్వ, ప్రైవేటు, టీటీడీ కళాశాలల్లో తరగతులు ప్రారంభమవుతాయని ఆ ఉత్తర్వులలో పేర్కొంది.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 6 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 65,384 మంది స్వామి వారిని దర్శించుకోగా 22,512 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ. 4.03 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం అవుతోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయాని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలోకి అనుమతించరని స్పష్టం చేసింది.

నేర నియంత్రణకు పకడ్బందీ చర్యలు

తిరుపతి క్రైమ్ : జిల్లాలో ఎన్ఫోర్ విధులను పెంచి నేర నియంత్రణ కట్టడి చేసినట్లు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. ఎస్పీ ఆధ్వర్యంలో జిల్లా పోలీసులు ఎన్ఫోర్స్‌మెంట్ విధులను పెంచి, ఆగస్టులో సాధించిన పురోగతి వివరాలను వెల్లడించారు. ప్రతిరోజు స్పెషల్ పార్టీ పోలీసులతో జిల్లాలోని ముఖ్య పట్టణాల్లో గస్తీ తిరుగుతూ, రాత్రిపూట రోడ్లపై తిరుగుతున్న 1260 అనుమానిత వ్యక్తులను పోలీస్ స్టేషన్‌కు తరలించి కౌన్సిలింగ్ ఇచ్చి పంపినట్లు తెలిపారు. గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తూ సుమారు 65.600 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. బహిరంగంగా మద్యం తాగే వారిపై 1209 కేసులను నమోదు చేసి, కోర్టులో జరిమానాలు వేయించినట్లు చెప్పారు. అలాగే 279 మంది వాహనదారులపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశామన్నారు. రోడ్లకు ఇరువైపులా ఆక్రమించి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే 1414 మంది చిరు వ్యాపారులపై న్యూసెన్స్ యాక్ట్ కేసులను నమోదు చేసి ఇబ్బందులు లేకుండా చేసినట్లు తెలియజేశారు. దీంతోపాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న 791 మంది రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించినట్లు తెలిపారు.

ఉచిత బస్సా..మజాకా!

- కండక్టర్, డ్రైవర్‌ను వేడుకున్నా నిలపని వైనం
- బస్సు దిగి 2 కి.మీ నడుచుకుంటూ ఊరికి వెళ్లిన మహిళ



ఉచిత బస్సు ప్రయాణానికి చెందిన టికెట్ చూపుతున్న మహిళ

చిల్లకూరు : ఆర్టీసీలో మహిళలకు ప్రభుత్వం ఉచిత ప్రయాణం ఏర్పాటు చేసింది. అయితే ఎక్స్‌ప్రెస్ బస్సులో ఎక్కిన మహిళలకు వారు దిగాల్సిన స్టేజీలో కాకుండా ఎంపిక చేసిన స్టేజీలోనే బస్సును నిలుపుతున్నారు. దీంతో మంగళవారం ఓ మహిళ బస్సు దిగి తన గ్రామానికి 2 కి.మీ. దూరం నడిచి వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. గూడూరు మండలం నెర్నూరుకు చెందిన విజయమ్మ వెంకటగిరి డిపో బస్సు గూడూరులో ఎక్కి నెర్నూరుకు టికెట్ తీసుకుంది. స్టేజీ వచ్చిన సమయంలో డ్రైవర్‌కు తాను దిగాలని కోరితే పక్క స్టేజీలో నిలుపుతామని చెప్పి వేగంగా బస్సును తీసుకుని వెళ్లాడు. దీంతో ఆమె బస్సు దిగి తన ఊరికి సుమారు 2.కి.మీ దూరం నడిచి వెళ్లాల్సి వచ్చింది. ఉచిత బస్సు ఎక్కి ప్రయాణం చేస్తే రెండు కి.మీ నడిపించారని ఉచితం అంటే ఇలానే ఉంటుందా అని మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. మహిళలు తాము ఎక్కడి దిగాలని అనుకుంటారో అక్కడే నిలిపేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మహిళలు కోరుతున్నారు.

నేడు పోలేరమ్మతల్లి జాతర రెండో చాటింపు

వెంకటగిరి రూరల్ : పోలేరమ్మ తల్లి జాతరకు సంబంధించి బుధవారం రెండో చాటింపు నిర్వహించనున్నారు. కాంపాళెంలోని కామాక్షమ్మ ఆలయం నుంచి పట్టణ పుర వీధుల్లో చాటింపు నిర్వహించనున్నారు. 7న ఘటోత్సవం, 10న అమ్మవారి ఉత్సవం, 11న నిలుపు, నగరోత్సవం, నిమ్రజ్జనం జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మళ్లీ రావా.. రాజన్నా!



తిరుపతి తుడా సర్కిల్ వద్ద వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న భూమన కరుణాకరరెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, మేయర్ డాక్టర్ శిరీష, భూమన అభినయ్‌రెడ్డి, మల్లం రవిచంద్రారెడ్డి, జయచంద్రారెడ్డి, నేతలు

ఆ మహానేత దూరమై పదహారేళ్లయినా కోట్లాది గుండెలు ఆయన్ని నిత్యం స్మరిస్తూనే ఉన్నాయి. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా జిల్లాలో వాడవాడలా నివాళి అర్పించి స్మరించుకున్నారు. మంగళవారం ఆయన వర్ధంతిని పురస్కరించుకుని రాజన్న పాలనలో చేసిన సేవలను గుర్తు చేసుకొని పలువురు కన్నీటి పర్యంతం అయ్యారు. మహానేత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఫీజు రీయంబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ , 108, 104, ఉచిత విద్యుత్ తదితర సంక్షేమ పథకాలను గుర్తు చేసుకొని ఉప్పొంగిపోయారు. రాజన్న లేనిలోటు తీర్చలేనిదని ఆవేదన చెందారు. మళ్లీ రావా .. రాజన్న అంటూ పలువురు భావోద్వేగానికి గురయ్యారు. జోహార్ వైఎస్సార్.. వైఎస్సార్ అమర్‌రహే అంటూ నినదించారు.

- మహానేతకు ఘన నివాళి
- రాజన్నను గుర్తు చేసుకుంటూ కన్నీటి పర్యంతం
- మహానేత చిత్రపటాలు, విగ్రహాలకు పుష్పాంజలి
- పలుచోట్ల పేదలకు అన్నదాన కార్యక్రమాలు
- కుంట్రపాకలో రక్తదాన శిబిరం

తిరుపతి అర్బన్ : జిల్లాలో వాడవాడలా వైఎస్సార్ వర్ధంతిని జరుపుకున్నారు. పలుచోట్ల సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి పేదల గుండె గుడిలో గూడుకట్టుకున్నారని కొనియాడారు. భౌతికంగా దూరమైనా ఆయన ఆప్యాయత , అభివృద్ధి కార్యక్రమాలు చిరస్థాయిగా నిలిచిపోయాయని గుర్తుకు తెచ్చుకున్నారు. జోహార్ వైఎస్సార్.. వైఎస్సార్ అమర్‌రహే అంటూ నినాదాలు మిన్నంటాయి.



పేదలకు అన్నదానం చేస్తున్న నేతలు

శ్రీకాళహస్తి నియోజకవర్గంలోనూ పలుచోట్ల వర్ధంతి నిర్వహించారు. ప్రధానంగా శ్రీకాళహస్తి పట్టణంలోని సినిమా వీధిలోని వైఎస్సార్ విగ్రహానికి నివాళి అర్పించారు. శ్రీకాళహస్తి దేవస్థానం మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, తొట్టంబేడు పార్టీ మండల నాయకుడు ఉన్నం వాసు నాయుడు ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు, అలాగే రేణిగుంటలో వైఎస్సార్‌సీపీకి చెందిన ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం పాల్గొన్నారు. అక్షయ క్షేత్రంలో పండ్లు, స్నాక్స్ పంపిణీ చేశారు. స్థానిక నేతలు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు హాజరయ్యారు.

గూడూరు నియోజకవర్గంలో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించారు. గూడూరు పట్టణంలోని పడిగేసాహెబ్‌పేట, మార్కెట్ సెంటర్, శాంతినగర్, టవర్ క్లాక్ సెంటర్ల వద్ద వైఎస్సార్ విగ్రహాలకు నివాళి అర్పించారు. మండల కేంద్రాల్లో వర్ధంతిని జరుపుకున్నారు. వైఎస్సార్ పాలనలో గూడూరులో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను గుర్తు చేసుకున్నారు. నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

పేదల గుండె చప్పుడు వైఎస్సార్

- జగనన్నను తిరిగి ముఖ్యమంత్రి చేసుకునే వరకు శ్రమిద్దాం
- వైఎస్సార్ వర్ధంతిలో భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : దేశ రాజకీయ చరిత్రలోనే ఎవ్వరికీ సాధ్యం కానన్ని సంక్షేమ పథకాలు అందించి ప్రతి పేదవాడి గుండె చప్పుడుగా నిలిచిపోయిన మహోన్నత వ్యక్తి దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ 16వ వర్ధంతి సందర్భంగా తిరుపతి తుడా సర్కిల్‌లోని వైఎస్సార్ విగ్రహానికి భూమన కరుణాకరరెడ్డి వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి నివాళి అర్పించారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా కరుణాకరరెడ్డి మాట్లాడుతూ.. మహానేత వైఎస్ఆర్ పాలనలో చరిత్రలో నిలిచిపోయేలా పేదలకు సంక్షేమ పథకాలు అందించారన్నారు. వైఎస్సార్ మరణవార్త విని 700 మందికి పైగా గుండెలు ఆగి చనిపోయారంటే ఆయనపై ప్రజలకు ఉన్న అభిమానం ఏపాటిదో తెలుస్తుందన్నారు. తండ్రి ఆశయాలను అందిపుచ్చుకుని తండ్రికి తగ్గ తనయుడిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అందించారన్నారు. అయితే చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ జగనన్నపై తప్పుడు ఆరోపణలు, విమర్శలు చేసి వారి పత్రికలు, చానళ్లల్లో విష ప్రచారం చేయించుకుని అధికారంలోకి వచ్చారన్నారు. ప్రజల పక్షాన నిలబడి పోరాడుదామని, రాబోయే రోజుల్లో జగనన్నను తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకోవడానికి కంకణబద్ధులవుదామని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, మేయర్ డాక్టర్ శిరీషా,వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి, పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు మాధవరెడ్డి, పార్టీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, నేతృత్వంలో 500 మందికి పైగా అన్నదానం చేశారు.కార్యక్రమంలో కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, వివిధ సంస్థల చైర్మన్లు, డైరెక్టర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



తిరుపతి : వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఓబుల్‌రెడ్డి, నేతలు



ఎస్వీ యూనివర్సిటీ వైఎస్ఆర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీకి చెందిన ప్రచార విభాగం నేతలు



చంద్రగిరి : పేదలకు అల్పాహారం పంపిణీ చేస్తున్న చెవిరెడ్డి మోహిత్ రెడ్డి తదితరులు

- చంద్రగిరి నియోజకవర్గంలోనూ వైఎస్సార్ వర్ధంతిని నిర్వహించారు. పార్టీ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తిరుపతి రూరల్, పాకాల, ఆర్సీ పురం, చంద్రగిరిలో చేపట్టిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రధానంగా తిరుపతి రూరల్‌లోని కుంట్రపాకంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. చిగురువాడలో వైఎస్సార్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. పాకాల ఆర్టీసీ బస్టాండ్ వద్ద వర్ధంతిని నిర్వహించారు. చంద్రగిరి టవర్‌క్లాక్ వద్ద అన్నదానం చేపట్టారు. ఆర్సీ పురంలోని నెనూరు, టీవీపురంలోని వైఎస్సార్‌కు నివాళి అర్పించారు. పార్టీకి చెందిన మండల నాయకులతో పాటు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వెంకటగిరి సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి నియోజకవర్గంలోనూ పలుచోట్ల వర్ధంతి కార్యక్రమాలు జరుపుకున్నారు. పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ నేతలు, కార్యకర్తలు హాజరయ్యారు. వెంకటగిరి అభివృద్ధికి వైఎస్సార్ పాలనలో చేపట్టిన కార్యక్రమాలను గుర్తుచేసుకున్నారు. అలాగే డక్కిలి మండల కేంద్రంలో వైఎస్సార్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎస్వీ బీసీ చైర్మన్ సాయికృష్ణ యాచంద్రతోపాటు స్థానిక నేతలు , పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



సూళ్లూరుపేట : వైఎస్సార్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య, నాయకులు

సూళ్లూరుపేట నియోజకవర్గంలో వైఎస్సార్ వర్ధంతిని జరుపుకున్నారు. నాయుడుపేటలోని బస్టాండ్ వద్ద, ప్రభుత్వ ఆస్పత్రి వద్ద వైఎస్సార్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య నేతృత్వంలో నివాళి అర్పించారు. అన్నదానం నిర్వహించారు. పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు విచ్చేశారు. సూళ్లూరుపేటలో ఎంపీపీ అల్లూరి అనిల్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళి అర్పించారు. పెళ్లకూరులో పార్టీ సీనియర్ నేత కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో, తడలో పార్టీ మండల అధ్యక్షుడు ఆర్ముగం, ఓజిలి మండలంలో పార్టీ మండల అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి నేతృత్వంలో వర్ధంతి కార్యక్రమాలు జరుపుకున్నారు.



సత్యవేడు : పేదలకు అన్నదానం చేస్తున్న నూకతోటి రాజేష్, నేతలు

సత్యవేడు నియోజకవర్గంలో వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా పలు కార్యక్రమాలు చేపట్టారు, కేవీబీపురం, పిచ్చాటూరు, నారాయణవనంలో పార్టీ సమన్వయకర్త నూకతోటి రాజేష్ నేతృత్వంలో వైఎస్సార్‌కు నివాళి అర్పించారు. అలాగే బీఎన్ కండ్రిగలో పార్టీ మండల అధ్యక్షుడు మణి నాయుడు ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. వరదయ్యపాళెంలో దయాకర్ రెడ్డి, కేవీబీపురంలో గవర్ల కృష్ణయ్య ఆధ్వర్యంలో వైఎస్సార్‌కి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సత్యవేడులో శ్రీసిటిని ఏర్పాటు చేయడంతో వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించిన అంశాన్ని గుర్తు చేసుకున్నారు.

ఇడుపులపాయలో..



ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : మహానేత, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 16వ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద గజమాలతో చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి నివాళులర్పించారు. వైఎస్సార్‌తో గడిపిన మధురస్మృతులను గుర్తు చేసుకున్నారు. నీవెక్కడికి వెళ్లిపోయావు రాజన్నా అంటూ కన్నీటిపర్యంతమయ్యాయరు.

'సాక్షి' ఎడిటర్‌పై కేసు అప్రజాస్వామికం!

- చిత్తూరులో ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ప్రెస్‌క్లబ్ సభ్యుల నిరసన
- పత్రికా స్వేచ్ఛను కాపాడాలని నినదించిన జర్నలిస్టులు
- పోలీసులకు వినతి పత్రం అందచేసిన పాత్రికేయులు





చిత్తూరు వన్‌టౌన్ స్టేషన్ ఎదుట పాత్రికేయుల నిరసన (ఇన్‌సెట్) చిత్తూరులో సీఐకి వినతిపత్రం అదజేస్తున్న జర్నలిస్టులు

చిత్తూరు అర్బన్: అధికారులకు అనుకూలంగా పత్రికల్లో వార్త రాయకుంటే కేసులు పెట్టడం ఎంత వరకు సమంజసమని పాత్రికేయులు ప్రశ్నించారు. పత్రికల్లో ప్రచురితమైన వార్త తమకు నచ్చలేదనే కారణంతో.. పత్రికా స్వేచ్ఛను కాలరాస్తూ అక్రమ కేసులు పెట్టడం భావ్యం కాదన్నారు. 'సాక్షి' ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డిపై కేసు నమోదు చేయడాన్ని నిరశిస్తూ చిత్తూరులో ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే), చిత్తూరు ప్రెస్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం చిత్తూరులో పాత్రికేయులు నిరసన వ్యక్తం చేశారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఎం.లోకనాథన్ మాట్లాడుతూ రాష్ట్రంలో పలువురు డీఎస్పీలకు పదోన్నతులు రావాల్సి ఉండగా, ఆలస్యం చేయడం వెనుక అక్రమాలు జరిగాయనే కోణంలో 'సాక్షి' పత్రికలో వార్త ప్రచురితమైందన్నారు. ఈ వార్తలో ఏదైనా అభ్యంతరకరమైన విషయం ఉంటే అధికారులు ఖండించాల్సిం ఉందన్నారు. అలా కాదని 'సాక్షి' ఎడిటర్ ధనంజయరెడ్డిపై కేసు నమోదు చేయడం పత్రిక స్వేచ్ఛకు సంకెళ్లు వేయడమేనన్నారు. దీనిపై దేశ అత్యున్నత న్యాయస్థానం ఇప్పటికే పలు కేసుల్లో స్పష్టత కూడా ఇచ్చిందన్నారు. భావ వ్యక్తీకరణను తెలియచేసే పత్రికల నిర్వాహకులపై కేసులు పెట్టడం సమాజానికి మంచిది కాదన్నారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్ కార్యదర్శి వై.కాలేశ్వరరెడ్డి, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కెఎం.అశోక్‌కుమార్ మాట్లాడుతూ నిజాలు రాసే జర్నలిస్టులపై అక్రమ కేసులు పెట్టడం, అరెస్టులు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. ప్రభుత్వానికి, అధికారులకు, ప్రజలకు మధ్య పాత్రికేయులు వారధిలా పనిచేస్తున్నారన్నారు. నిజాలను పత్రికల ద్వారా ఎత్తి చూపినపుడు వాటిని సరిదిద్దుకోవాల్సిందిపోయి.. తప్పుడు కేసులు పెట్టడం తగదన్నారు. 'సాక్షి' ఎడిటర్‌పై నమోదు చేసిన అక్రమ కేసును ఎత్తివేయాలని చిత్తూరు వన్‌టౌన్ సీఐ మహేశ్వరకు వినతిపత్రం అందజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో చిత్తూరు ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షుడు శివప్రసాద్, కార్యవర్గ సభ్యులు బాలసుందరం, చంద్రశేఖర్, ఏపీయూడబ్ల్యూజే సభ్యులు సురేష్, చంద్రప్రకాష్, హరీష్, శ్రీనివాసులు, చిరంజీవి, ప్రవీణ్‌సాయి, జయకుమార్ పాల్గొన్నారు.

మిథున్‌రెడ్డి విడుదల కావాలని పూజలు

నారాయణవనం : రాజకీయ కుట్రతో లిక్కర్ కేసులో రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేయడం అక్రమమని సత్యవేడు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ పేర్కొన్నారు. మంగళవారం నారాయణవనం బైపాస్ వైఎస్సార్ సర్కిల్ నుంచి వినాయకస్వామి ఆలయం వరకు ప్లకార్డులతో నిరసనగా ర్యాలీ నిర్వహించారు. అక్రమ కేసు నుంచి క్లీన్‌చిట్ రావాలని వినాయకస్వామికి అర్చనలు చేసి 108 కొబ్బరికాయలను కొట్టారు. ఈ సందర్భంగా రాజేష్ మీడియాతో మాట్లాడుతూ.. ప్రజాదరణ ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులను అక్రమ కేసులతో అరెస్ట్ చేస్తే పార్టీ శ్రేణులు భయపడే కాలం చెల్లిపోయిందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా అభివృద్ధిపై దృష్టి పెట్టకుండా జగనన్న ప్రారంభించి, పూర్తి చేసిన పనులు తామే చేసినట్లు కాలం వెలిబుచ్చుతున్నారని ఎద్దేవా చేశారు. నిరసనలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి బీరేంద్రరాజు, మండల కన్వీనర్ సారకాయలు, ఎంపీపీ దివాకర్‌రెడ్డి, ముఖ్య నాయకులు భానుప్రకాష్‌రెడ్డి, అన్నాదొరై, రాకేష్ కిరణ్, వైస్ ఎంపీపీ శివశంకర్, ఎంపీటీసీ సభ్యులు రవి, పొన్నుస్వామి, శంకరయ్య, సర్పంచ్‌లు సాయిరవి, తుంబూరు నాగూరు, సుబ్రమణ్యంరెడ్డి, తిరువట్యం నాగూరు, గుణశేఖర్, మురళి, నాయకులు పాల్గొన్నారు.



వినాయకుడికి కొబ్బరికాయలు కొట్టి వేడుకుంటున్న పార్టీ శ్రేణులు



నారాయణవనం : మిథున్‌రెడ్డి అక్రమ అరెస్ట్‌ను నిరసిస్తూ ర్యాలీ చేస్తున్న రాజేష్, నేతలు

క్లుప్తంగా

స్కిల్స్ కాంపిటీషన్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరణలో కలెక్టర్‌తో పాటు స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులు

తిరుపతి అర్బన్ : కలెక్టరేట్ కార్యాలయంలో మంగళవారం కలెక్టర్ చేతుల మీదుగా ఇండియా స్కిల్స్ కాంపిటీషన్–25 పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ పోటీల్లో పాల్గొనడానికి 16–25 ఏళ్ల యువత అర్హులుగా జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి లోకనాథం తెలిపారు. ఈనెల 30లోపు ఈకేవైసీ ధ్రువీకరణ సహా రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉందని వెల్లడించారు. స్కిల్ ఇండియా డిజిటల్ హాబ్‌లో ఎస్‌ఐడీహెచ్ పోర్టల్‌లో ప్రత్యేక ఖాతాను ఏర్పాటు చేసుకుని ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాల్సి ఉందని వివరించారు. అదనపు సమాచారం కోసం 99666 01867, 72073 89948 నంబర్లను సంప్రదించాలని సూచించారు. ఈ పోటీల్లో విజేతలకు అంతర్జాతీయ స్థాయిలో అవార్డును అందిస్తారు. అంతే కాకుండా స్కిల్స్‌ను మెరుగుపరుచుకోవడానికి ఈ పోటీలు దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ ఉద్యోగులు గణేష్, సురేష్, దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

ఎంబీయూలో ముగిసిన అంతర్జాతీయ సదస్సు



సదస్సు బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

చంద్రగిరి : రెండు రోజుల పాటు తిరుపతి జిల్లా చంద్రగిరి మండలంలోని మోహన్‌బాబు యూనివర్సిటీ (ఎంబీయూ)లో డేటా సైన్స్ విభాగం, స్కూల్ ఆఫ్ కంప్యూటింగ్ ఆధ్వర్యంలో ఐఈఈఈ–2025 ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ టెక్నాలజీస్ (ఐసీఏసీటీ 2025) కార్యక్రమం మంగళవారం ముగిసింది. ఈ సదస్సులో కృత్రిమ మేధ (ఏఐ), డేటా సైన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఎల్‌ఓటి), సస్టైనబుల్ కంప్యూటింగ్‌లపై విస్తృతంగా చర్చించారు. ఆధునిక కంప్యూటింగ్ వాస్తవ ప్రపంచ సమస్యల పరిష్కారం, డిజిటల్ రూపాంతరానికి మార్గదర్శకంగా ఉండటంలో ప్రాముఖ్యంపై చర్చించారు. ఈ సదస్సు ద్వారా యువ పరిశోధకులు, విద్యార్థులు తమ పరిశోధన పత్రాలను ప్రదర్శించి, గ్లోబల్ నిపుణులతో చర్చించే వేదికను పొందారని నిర్వాహకులు తెలిపారు. అనంతరం ఐఈఈఈకు సంబంధించిన బ్రోచర్లను ఆవిష్కరించారు.

బ్రహ్మోత్సవాలకు బస్సుల ఒప్పందం

తిరుపతి అర్బన్: తిరమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఈ నెల 24 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు బస్సుల రాకపోకలపై తమిళనాడు– తిరుపతి జిల్లా ఆర్టీసీ అధికారులు ఒప్పందం కుదుర్చుకున్నారు. మంగళవారం నగరంలోని డీపీటీఓ కార్యాలయంలో సమావేశమై చర్చించారు. ఈ నెల 23 నుంచి అక్టోబర్ 6 వరకు బ్రహ్మోత్సవాలు సందర్భంగా ప్రత్యేక బస్సులను నడిపేందుకు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసుకున్నారు. తమిళనాడు నుంచి 150 బస్సులు, తిరుపతి జిల్లా నుంచి 150 బస్సులను తమిళనాడుకు నడపాలని నిర్ణయించారు. డీపీటీఓ జగదీష్, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ విశ్వనాథం, డిప్యూటీ చీఫ్ మెకానిక్ ఇంజినీర్ బాలాజీ, , తమిళనాడు ఆర్టీసీ అధికారులు మోహన్, గుణశేఖరన్, సేలం పాల్గొన్నారు.

‘తెల్ల’బోయే దోపిడీ

శ్రీనివాసా.. వినాయక.. అక్రమాలు ఆగేనా!

- యథేచ్ఛగా అక్రమ మైనింగ్
- కాలం చెల్లిన గనుల్లో ముఖ్యనేత పనులు
- నిబంధనలకు తిలోదకాలు
- పట్టించుకోని అధికారులు



రవాణాకు సిద్ధంగా ఉన్న ఖనిజం ఇదే

సాక్షి టాస్క్‌ఫోర్స్ : మండలంలోని సైదాపురం, చాగణం రాజుపాళెం సమీపంలో ఎలాంటి అనుమతి లేకుండా ఓ ముఖ్యనేత కనుసన్నల్లో అక్రమ మైనింగ్ యథేచ్ఛగా మళ్లీ మొదలైంది. 9 నెలలు క్రితమే స్థానిక ప్రజాప్రతినిధికి ఆ ముఖ్యనేత మధ్య చెలరేగిన వివాదం కారణంగా ఆ మైన్స్‌పై పోలీసులు, రెవెన్యూ అధికారులు మూకుమ్మడిగా దాడులు చేసి పలు వాహనాలను స్వాధీనం చేసుకున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో కూటమి నేతల మధ్య ఏమి జరిగిందో ఏమో ? కానీ శ్రీనివాసా పద్మావతి, సిద్ధి వినాయక గనుల్లో మళ్లీ అక్రమంగా మైనింగ్ చేస్తూ నిబంధనలకు తిలోదకాలు ఇస్తున్నారు. మంగళవారం అనధికారికంగా ఆ రెండు గనుల్లో అక్రమంగా బ్లాస్టింగ్ కూడా చేసినట్లు తెలుస్తోంది.



శ్రీనివాస పద్మావతి(శోభారాణి)లో లీజులు లేకుండా అక్రమంగా తవ్వకాలు సాగిస్తున్న దృశ్యం

మొదలైన పనులు?

పొట్టి శ్రీరాముల నెల్లూరు జిల్లాలోని సైదాపురం, పొదలకూరు , చేజర్ల, ఉదయగిరి మండలంతో పాటు తిరుపతి జిల్లాలోని గూడూరు ప్రాంతాల్లో దొరికే క్వార్జ్ , ఫల్స్‌పర్, వర్ముఖ్‌లైట్ ఖనిజానికి విదేశాల్లో కూడా మంచి గిరాకీ ఉంది. ప్రధానంగా సైదాపురం మండలంలో దొరికే క్వార్జ్ ‘‘జమైకా ఖనిజానికి విపరీతమైన డిమాండ్ ఉంది. దీంతో కూటమికి చెందిన నేతలు కొత్తగా వ్యాపారాలు చేసేందుకు రంగ ప్రవేశం చేస్తున్నారు.



సిద్ధి వినాయకలో పనులు చేస్తున్న దృశ్యం

అనుమతుల్లేని గనుల్లో ..

మండలంలోని చాగణం రాజుపాళెం, సైదాపురం సమీపంలోనే కాలం చెల్లిన శ్రీనివాసా పద్మావతి(శోభారాణి) సిద్ధి వినాయక గనులున్నాయి. గతంలో లీజు కాల వ్యవధి తీరిపోవడంతో అవి అలాగే వదిలేశారు. ఈ గనిలో మైకా క్వార్జ్ ఖనిజం ఉంది. దీంతో ఈ ఖనిజానికి విపరీతమైన డిమాండ్ ఉండటంతో నేతలు కన్ను ఈ గనులపై పడింది. గత ఏడాది అక్టోబర్ నెలలో ఆ గనిలో అక్రమంగా మైనింగ్ కార్యకలాపాలు సాగిస్తుండటంతో స్థానిక ప్రజాప్రతినిధి అనుచరులు అధికారులచే ముమ్మరంగా తనిఖీలు చేయించి అందులో పని చేస్తున్న విలువైన యంత్రాలను స్వాధీనం చేసుకుని 13 మందిపై కేసులు నమోదు చేయించారు. మరోసారి మార్చి నెలల్లో కూడా అక్రమ తవ్వకాలు సాగిస్తుండటంతో కొందరు అడ్డుకుని పనులను నిలిపివేశారు. దీంతో ఆ గనుల వివాదం ముగిసింది. కాని ఏమైందో ఏమో కాని మంగళవారం నుంచి ఆ గనుల్లో అనుమతులు లేకుండానే మళ్లీ పనులు చేస్తుండటం గమనార్హం.

అక్రమ బ్లాస్టింగ్‌లు

రెండు గనుల్లో బ్లాస్టింగ్ చేసేందుకు అనుమతులు లేకపోయినా సరే మళ్లీ అక్రమ బ్లాస్టింగ్‌లతో చెలరేగిపోతున్నారు. ఈ గనులపై గ్రీన్ ట్రిబ్యునల్‌లో కూడా కేసులు నడుస్తున్నాయి. ఇటీవలనే డివిజన్ స్థాయి అధికారి పర్యవేక్షణలో మైనింగ్, పర్యావరణ శాఖ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేశారు. అయినా ఫలితం లేకుండా పోయిందని ఈ ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. అనుమతులే లేని గనుల్లో మళ్లీ తవ్వకాలు సాగిస్తున్నా అక్రమాలను అరికట్టే మైనింగ్ అధికారులతో పాటు స్థానిక అధికారులు కూడా మామూళ్ల మత్తులో జోగుతున్నారు. దీంతో అక్రమార్కుల తెల్ల బంగారం దోపిడీ యథేచ్ఛగా సాగిపోతోంది.

ట్రాన్స్‌ఫార్మర్ల దొంగల అరెస్టు



దొంగల అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న రూరల్ సీఐ కిషోర్‌బాబు

గూడూరు రూరల్ : పొలాల వద్ద ఉండే ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి రాగి వైర్లను చోరీ చేసే ఇద్దరు దొంగలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 135 కిలోల రాగి తీగలను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సీఐ కిషోర్‌బాబు తెలిపారు. గూడూరు రూరల్ పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఓజిలి మండలం ఆర్మేనిపాడు గ్రామానికి చెందిన చిన్నబ్బయ్య, పోలయ్య గూడూరు రూరల్, బాలాయపల్లి, డక్కిలి, చిల్లకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో 24 ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి రాగి తీగలను దొంగిలించారు. ఈ మేరకు గూడూరు రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 65 కేజీల రాగి తీగలు, బాలాయపల్లిలో 70 కిలోల రాగి తీగలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలను ఛేదించడంలో రూరల్ ఎస్‌ఐ మనోజ్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ బాలకృష్ణయ్య, శ్రీనివాసరావును అభినందించారు.

పొదుపు సంఘాలకు రుణాలు



హాజరైన పొదుపు సంఘం లీడర్లు, డీఆర్‌డీఏ ఉద్యోగులు

తిరుపతి అర్బన్ : సంవత్సరంలో ఎంత అప్పు కావాల్సి ఉందో పొదుపు సంఘం సభ్యుల నుంచే ముందే సమాచారం తీసుకుంటారని సెర్ప్ సీఈవో వాకాటి కరుణ వెల్లడించారు. మంగళవారం ఆమె తిరుపతి రూరల్ ఎంపీడీవో కార్యాలయంలో పొదుపు సంఘం సభ్యులతో జిల్లా స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పొదుపు సంఘం లీడర్లతో పాటు డీఆర్‌డీఏ ఉద్యోగులు హాజరయ్యారు. ఈ క్రమంలో ఆమె మాట్లాడుతూ.. అవినీతి అక్రమాలకు తావు లేకుండా మొబైల్ యాప్‌ను సిద్ధం చేశామని చెప్పారు. ప్రతి పొదుపు సభ్యురాలును లక్షాధికారిగా తయారు చేయడానికి మహిళలు వ్యాపార రంగంలోనూ రాణించాలని చెప్పారు. 2025–25 ఆర్థిక సంవత్సరంలో ఒక్క తిరుపతి జిల్లాలోనే సెర్ప్ వార్షిక రుణ ప్రణాళిక ద్వారా సుమారు రూ.3,200 కోట్లకు పైగా మహిళా సంఘం సభ్యులు వివిధ రుణాలు తీసుకుంటున్నారని స్పష్టం చేశారు. మరోవైపు కలెక్టర్ ఆధ్వర్యంలో వ్యవసాయ, పశుసంవర్ధక , ఉద్యానవన , పరిశ్రమలు, చేనేత, హ్యాండీ క్రాఫ్ట్స్ తదితర శాఖల అనుసంధానంతో బ్యాంకు వారి సహకారంతో జీవనోపాధుల కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టాలని డీఆర్‌డీఏ పీడీ శోభనబాబును ఆదేశించారు. మండలాల వారీగా బ్యాంకు మేనేజర్లు, అనుబంధ శాఖలు, మండల స్థాయి అధికారులు, సెర్ప్ సిబ్బందితో సమావేశాలు నిర్వహించి మహిళా సంఘం సభ్యుల జీవనోపాధుల పెంపునకు తోడ్పాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు, అడిషన్ పీడీ ప్రభావతి, డీపీఎంలు, ఏపీఎంలు పాల్గొన్నారు.

దుర్గసముద్రంలో కొనసాగుతున్న పికెట్

- 11 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు



దుర్గసముద్రం దళితవాడలో కాపలాకాస్తున్న పోలీసులు

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : తిరుపతి రూరల్ మండలం దుర్గ సముద్రంలో దళితవాడపైకి అగ్రకులానికి చెందిన వారు దాడి చేసిన ఘటనలో గాయపడిన వారు ఆసుపత్రి నుంచి డిశ్చార్జి కావడంతో మంగళవారం పోలీసులు పికెట్ కొనసాగించారు. దళితవాడను సోమవారం ఉదయం 11 గంటల నుంచి రాత్రి పగలు కాపలా కాస్తున్నారు. గ్రామంలోకి కొత్త వ్యక్తులు ఎవ్వరినీ రానీయకుండా కట్టడి చేశారు. దాడులు చేసిన ఓ సామాజిక వర్గానికి చెందిన వారిపై ప్రత్యేక దృష్టి పెట్టి దళితవాడ వైపు కన్నెత్తి చూడకుండా పటిష్ట చర్యలు తీసుకున్నారు. సీఐ చిన్న గోవిందు తమ సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తుండగా డీఎస్పీ ప్రసాద్ పికెట్‌ను పర్యవేక్షిస్తున్నారు. దాడుల్లో తీవ్రంగా గాయపడిన చిరంజీవి నుంచి ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు ఓ సామాజిక వర్గానికి చెందిన మునిప్రసాద్, మాకా హరీష్, జగదీష్, విజయ్, బాలాజీ, గాజుల రవి, పి.భరత్, శ్రీకాంత్, ఎం.లోకేష్, ఎం.శాంతి కుమార్, మాకా మహేష్ అను 11 మంది యువకులపై ఎస్సీ, ఎస్టీ పీఓఏ యాక్ట్ కింద నాన్ బెయిలబుల్ కేసును నమోదు చేశారు. కాగా గ్రామంలో శాంతి భద్రతలు అదుపులోనే ఉన్నాయని, గ్రామాలపై ఎవ్వరు దాడులు చేసినా కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని పోలీసులు హెచ్చరించారు.

ఎస్వీయూ లక్ష్య సాధనకు కృషి



జ్యోతి ప్రజ్వలనలో వీసీ ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్

తిరుపతి సిటీ : ఎస్వీ యూనివర్సిటీ స్థాపన లక్ష్యాలను నెరవేర్చే దిశగా కృషి చేద్దామని వీసీ ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు పేర్కొన్నారు. మంగళవారం వేంకటేశ్వర విశ్వవిద్యాలయం 71వ వ్యవస్థాపక దినోత్సవ నేపథ్యంలో విశ్వవిద్యాలయ ఉద్యోగ బృందంతో కలిసి ప్రాంగణంలోని టంగుటూరి ప్రకాశం పంతులు, నీలం సంజీవరెడ్డి, మహాత్మా గాంధీ, ఆచార్య గోవిందరాజులు, బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వ్యవస్థాపక దినోత్సవ సంబరాలు శ్రీనివాస ఆడిటోరియంలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వీసీ ఆచార్య అప్పారావు మాట్లాడుతూ.. వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఏర్పాటు వెనుక గల ఎంతో మంది మహనీయుల కలల్ని నెరవేర్చడానికి సమష్టిగా కృషి చేయాలని సూచించారు. ఎస్వీయూ వరల్డ్, ఆసియా ర్యాంకింగ్స్‌లో రాష్ట్రంలో ప్రథమ స్థానం పొందిందన్నారు. క్వాంటం టెక్నాలజీ, డ్రోన్ టెక్నాలజీని సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. అనంతరం రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు మాట్లాడుతూ.. ఎందరో మహనీయులు ఎంతో ఉన్నత లక్ష్యంతో శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీని స్థాపించారని తెలిపారు. యూనివర్సిటీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా చేపట్టిన క్రీడా సాంస్కృతిక పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. రిటైర్డ్ ఉద్యోగి విజయ్ కుమార్ మిమిక్రీ తో అందరినీ అలరించారు. మరో ఉద్యోగి అన్నమయ్య వేషధారణతో ఆహుతులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో జాయింట్ రిజిస్ట్రార్ చంద్రయ్య, నాన్ టీచింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గుర్రంకొండ శ్రీధర్, నెల్లూరు సుబ్రహ్మణ్యం, పలువురు ఉద్యోగులు కుటుంబ సమేతంగా హాజరయ్యారు.

తాళం పడిందా.. గొళ్లెం విరగాల్సిందే!

- ఇద్దరు గజ దొంగల అరెస్టు
- 151 గ్రాముల బంగారం స్వాధీనం



పట్టుబడిన దొంగలను చూపిస్తున్న డీఎస్పీ శ్యాంసుందరం

తిరుపతి క్రైమ్ : నగరంలో తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తూ దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు గజ దొంగలను మంగళవారం అరెస్టు చేసినట్లు డీఎస్పీ శ్యాం సుందరం తెలిపారు. ఆయన వివరాల మేరకు.. గత నెల 14వ తేదీన బైరాగిపట్టెడిలో నివాసం ఉన్న టీటీడీ సూపరింటెండెంట్ శ్రీనివాసులు సొంత పనులు నిమిత్తం ఇంటికి తాళం వేసి హైదరాబాద్ వెళ్లారు. అయితే 18వ తేదీ తిరిగి ఇంటికి వచ్చేసరికి తాళం పగలగొట్టి ఇంట్లో ఉన్న వస్తువులన్నీ గుర్తు తెలియని వ్యక్తులు దోచుకెళ్లినట్లుగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా.. మంగళవారం ఉదయం మంగళం రోడ్డులోని బొంతాలమ్మ గుడి వద్ద ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా ఆటోలో ఉండడం గమనించి వారిని అరెస్టు చేశామన్నారు. తిరుపతికి చెందిన అక్కుర్తి నవీన్, దేరంగుల జగదీష్ ఇరువురు ముఠాగా ఏర్పడ్డారన్నారు. మొదటి నిందితుడు నవీన్ తన అనుచరులతో కలిసి 2019 నుంచి 23 వ సంవత్సరం వరకు సుమారు 21 దొంగతనాలకు పాల్పడినట్లు పేర్కొన్నారు. తిరుపతి, ఎంఆర్ పల్లి, అలిపిరి, బైరవ, పట్టిన వంటి ప్రాంతాలలోనే కాకుండా శ్రీకాళహస్తి, గూడూరు, వెంకటగిరి తదితర ప్రాంతాల్లో ఒంటరిగా వెళ్తున్న మహిళలను టార్గెట్ చేసి చైన్ స్నాచింగ్ పాల్పడే వారిని తెలిపారు. ఇదే క్రమంలో నవీన్‌కు జగదీష్ పరిచయం కావడంతో ఇద్దరూ కలిసి విలాసాల కోసం దొంగతనాలకు పాల్పడేవారు. బైరాగి పట్టెడి లో కూడా దొంగతనం చేసినట్లుగా ఒప్పుకున్నారని తెలిపారు. వీరి వద్ద మొత్తం 12.50 లక్షలు విలువ చేసే 151 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇందులో వెస్ట్ పోలీస్ స్టేషన్‌లోని ఓ కేసులో 15 గ్రాములు మరో కేసులో 13 గ్రామాలతో పాటు సీసీఎస్ పోలీస్ స్టేషన్లో 123 గ్రాముల బంగారు కేసులో రికవరీ చేయడం జరిగిందన్నారు. ఈ కేసును ఛేదించడంలో సీఐలు చిన్న పెద్దయ్య, ప్రకాష్, శివ కుమార్ రెడ్డి , ఎస్ఐలు ప్రదీప్ కుమార్ రెడ్డి, రామ్మోహన్ ఎంతగానో కృషి చేశారన్నారు.

కాలువలో పడి తమిళనాడు వాసి మృతి



కాలువలో ఆనంద్‌ప్రభు మృతదేహం

చిల్లకూరు : చిల్లకూరులోని ఓ రొయ్యల కంపెనీలో పనిచేసే ఓ వ్యక్తి జాతీయ రహదారి పక్కనే ఉన్న కాలువలో పడి మృతి చెందినట్లు మంగళవారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించిన అనంతరం వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ.. తమిళనాడు రాష్ట్రం తిరుచానూర్ జిల్లాలోని తుత్తుకుడికి చెందిన ఆనంద్‌ప్రభు(33) కొంతకాలంగా చిల్లకూరు సమీపంలోని ఓ రొయ్యల కంపెనీలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడన్నారు. ఈ క్రమంలో అతడు జాతీయ రహదారి పక్కనే ఉన్న కాటా వద్ద ఉన్న గోడపై కూర్చుని ఉన్న సమయంలో వెనక్కి కాలువలో పడి మృతి చెంది ఉండవచ్చని పోలీసులు తెలిపారు. అనంతరం మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కలుషిత నీటితో కలకలం



ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న గుత్తివారిపల్లి బాధితులు

- రోగాలొస్తేనే..గ్రామాలకు..
- గుత్తివారిపల్లికి అధికారుల పరుగులు
- గ్రామాల్లో పారిశుద్ధ్య లోపం
- ఆపదలో ఉపయోగపడ్డ వైఎస్సార్ విలేజ్ క్లినిక్

రేణిగుంట : మండలంలోని గుత్తివారిపల్లిలో డయేరియా వ్యాప్తి చెంది గ్రామస్తులు ఆసుపత్రి పాలైన తర్వాత అన్ని శాఖల అధికారులు గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించి, పారిశుద్ధ్య పనులు చేసి, బ్లీచింగ్ వేయడం చూసి రోగాలు వస్తేనే అధికారులకు గ్రామాలు గుర్తుకొస్తాయా అని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. గుత్తివారిపల్లిలో సోమవారం నుంచి సుమారు 30 మంది దాకా విరేచనాలు, వాంతులు రావడంతో మంగళవారం ఉదయం వైద్యాధికారులు గ్రామంలోని వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లో వైద్య శిబిరం నిర్వహించారు. డయేరియాకు కలుషిత నీరే ప్రధాన కారణమని వైద్యులు తెలిపారు. తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి హాస్పిటల్లో బాధితులను పరామర్శించి వైద్యుల ద్వారా ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



పైపు లీకేజ్ పనులను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి, ఇన్‌చార్జి ఎంపీడీవో



విలేజ్ క్లినిక్‌లో వైద్య శిబిరం

25మందికి డయేరియా

రేణిగుంట : మండలంలోని గుత్తివారిపల్లిలో 25 మంది డయేరియా బారిన పడ్డారు. స్థానికుల సమాచారం మేరకు వైద్యాధికారులు మంగళవారం గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించారు. విమానాశ్రయం సమీపంలోని ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్పించి చికిత్సలు అందిస్తున్నారు. జిల్లా వైద్యాధికారి బాలకృష్ణ నాయక్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని గ్రామాన్ని సందర్శించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ ప్రభురావు గ్రామంలో శానిటేషన్ పనులు చేయించారు. కలుషిత నీటి వల్లే స్థానికులు డయేరియా బారిన పడినట్లు వైద్యులు తెలిపారు.

గ్రామంలో పారిశుద్ధ్య లోపం ఉన్నా ఇన్ని రోజులు పట్టించుకోని అధికారులు డయేరియా వ్యాప్తి చెందడంతో ఒక్కసారిగా పారిశుద్ధ్య కార్మికులను తీసుకొచ్చి శానిటేషన్ పనులు చేయించారు.

ఆదుకున్న విలేజ్ క్లినిక్

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిర్మించిన వైఎస్సార్ విలేజ్ క్లినిక్ ఆపదలో ఉన్న సమయంలో ఆదుకుంది. విలేజ్ క్లినిక్‌లో మెడికల్ క్యాంపు నిర్వహించి ప్రథమ చికిత్సను అందించారు. మాజీ సీఎం ముందు చూపుతో నిర్మించిన విలేజ్ క్లినిక్ ఆపదలో ఉపయోగపడిందని గ్రామస్తులు చర్చించుకోవడం విశేషం.

సాధారణ స్థితికి వచ్చే వరకు గ్రామంలోనే వైద్యబృందం



గుత్తివారిపల్లిలోని బాధితుల ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉంది. నీటి శాంపిల్స్‌ను పరీక్షలకు పంపించాం. గ్రామంలో తాగునీటి లీకేజీ ఉన్న పైపులను గుర్తించి వాటికి మరమ్మతులు చేశారు. వైద్య సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే నిర్వహించారు. అందరూ పూర్తిగా కోలుకునే వరకు వైద్య బృందం గ్రామంలోనే ఉంటుంది.

– బాలకృష్ణ నాయక్ , జిల్లా వైద్యాధికారి

ఫెర్టిలైజర్ దుకాణాలపై విజిలెన్స్ దాడులు

- రూ.11.69 లక్షల విలువ కలిగిన యూరియా, కాంప్లెక్స్ సీజ్



వరదయ్యపాళెంలోని ఓ దుకాణంలో ఎరువులను సీజ్ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

వరదయ్యపాళెం : మండల కేంద్రమైన వరదయ్యపాళెం, చిన్న పాండూరు ప్రాంతాల్లోని ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. విజిలెన్స్ ఏఓ రామాంజనేయ రెడ్డి, ఎస్ఐ రామకృష్ణ వ్యవసాయశాఖ సిబ్బందితో కలసి దుకాణాలను తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎలాంటి బిల్లులు లేకుండా అనధికారికంగా నిల్వ ఉంచిన యూరియా, కాంప్లెక్స్ ఎరువులను సీజ్ చేశారు. సీజ్ చేసిన ఎరువులకు సంబంధించి 15 రోజుల లోపు బిల్లుల వివరాలను తమ దృష్టికి తీసుకువచ్చిన తర్వాతే వాటిని విక్రయాలకు అనుమతులు కల్పిస్తామని విజిలెన్స్ అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులకు తప్పనిసరిగా ఎంఆర్‌పీ ధరలకే ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు విక్రయించాలని సూచించారు. ప్రతి దుకాణం వద్ద రైతులకు తెలిసే విధంగా ధరల పట్టిక ఏర్పాటు చేయాలన్నారు. వారి వెంట మండల వ్యవసాయశాఖ అధికారిణి గౌరి, ఏఈఓ ప్రవీణ్ తదితరులు ఉన్నారు.